(9)

# ముగ్గురత్తగార్లు

సత్కార్యానికి వెయ్యి విఘ్నాలన్నారు! కాకపోతే నాంచారయ్య కాళ్ళుపట్టుతుండగా, కిటికీతలుపులు నాల్గింటిలో తగుమాత్రం గాలి రావడానికి వీలుగా ఒక్క తలుపు మాత్రమే తెరచుకొని, పట్టెమంచంమీద పాలసముద్రంలా పరచుకున్న తెల్లటి మెత్తపైన పడుకుని మెల్లమెల్లగా సుషుప్తిలోకి జారుకుంటున్న మునసబుగారికి నిద్రాభంగమా!

ఆయన వులికిపడి కళ్ళు తెరిచేశారు! ఇందాకా ఏ హాలాచ్ఛబ్దంవల్లనైతే మునసబుగారికి నిద్రాభంగం వాటిల్లిందో, అదే శబ్దం మళ్ళీ ఒకసారి ఆయనవీనుల్లో మారుమ్రోగింది.

నుదురు చిట్లించుకుంటూ, కళ్ళు కుంచించుకుంటూ "ఏమిటిది?" అన్నారు మునసబుగారు.

"హరికథ జరుగుతోంది బాబూ! మీకు తెలియదేమిటి?" అని కానేపాగి "మీకు తెలియకుండానే!" అంటూ ఆశ్చర్యాతిరేకంతో కళ్ళు పెద్దవి చేసుకుని అలాగే నోరు తెరిచేశాడు నాంచారయ్య.

తామరచెరువు గ్రామ చరిత్రలో యిది అపూర్వమైన విషయం.

'తనకు తెలియకుండానే హరికథా!' మునసబుగారి కళ్ళల్లో ఒకటి పూర్తిగా మూసుకపోయింది. మరొకటి అరమోడ్పు భంగిమలో వుండిపోయింది. క్రింది పెదవి ఒకవైపున పైకి లేచి, మరొక వైపున పైపంటి కింద నలిగిపోయింది. నాలుగైదు క్షణాలకొరితం ఆముఖంలో లీలగా భాసించిన చిరుకోపం, చేటంతమబ్బు దిక్కుల చివరలదాకా వ్యాపించినట్లుగా, అంతలోనే మునసబుగారి మానసాకాశమంతటా వ్యాపించింది.

ఆయన తటాలున పైకిలేచారు. పదడుగుల్లో గదీ, హాలూ దాటుకుని డాబాపైకి వచ్చారు. పిట్టగోడ కానుకుని ఊరివైపు చూచారు.

భజనగుడి ముంగిట పెట్రమాక్సులైటు జాజ్వల్యమానంగా వెలిగిపోతోంది. ఆ వెలుగులో ప్రొద్దుగుంకిన తర్వాత

వేసిన ఔంకాయమట్టల పందిరి పచ్చగా కలకల లాడి పోతుంది. పందిరికింద చెంగులు జీరాడగా పీతాంబరం కట్టుకున్న వాడు, మెడలో ఆజాను పర్యంతం వ్రేలాడుతున్న పుష్పహారాన్ని ధరించినవాడు, ఎదకూ, చేతులకూ చందనం అలదుకున్నవాడు, నుదుట నామాలు దిద్ది తీర్చుకున్న వాడూ అయిన హరిదాసు చేతులు పైకెత్తి, అంజలి ఘటించి, ఉపోద్ఘాతానికి పరిసమాప్తిని సూచిస్తూ, అసలు కథకు నాందిని ప్రారంభిస్తూ గోవింద నామ స్మరణ చేస్తున్నాడు.

"జయ రమారమణ గోవిందా!"

"గో...విందా!" చిన్నా పెద్దా, ఆడా మగా వ్యత్యాసం లేకుండా ఒక్కసారిగా నాలుగైదు వందల కంఠాల నుంచీ వినిర్ముక్తమైన గోవింద నామస్మరణ భజన గుడినుంచీ గ్రామచావడిదాకా కూర్చున్న జనాన్ని దాటుకుని మధ్యలో వున్న యిళ్ళనూ ఆ తరువాత ప్రాకారకుడ్యాన్ని, పూల తోటనూ దాటుకుని 'అలవైకుంఠపురంబులో, నగరులో, ఆమూల సౌధంబుదాపల' అన్నట్టుగా భవనంలో రెండో అంతస్థులో వున్న మునసబుగారి చెవుల్లో మళ్ళీ ఒకసారి వినదించింది.

ఆయన గిరుక్కున వెనుదిరిగారు.

"ఏమిటి బాబూ!" అన్నాడు నాంచారయ్య.

"ఈ కరణానికీ, ప్రెసిడెంటుకూ తలపైన కొమ్ములు మొలిచాయిరా!" అన్నారు మునసబుగారు.

"కాదామరి! మీతో మాట్లాడకుండానే తమంతట తామే హరికథ పెట్టిస్తారా! పిదప కాలమొచ్చింది బాబూ! మనుషులకు అంతరాంతరాలు తెలియడం లేదు."

"ఒరే నాంచారూ!"

నాంచారయ్యకు ఈ పరిణామం ఎంతో ఆనందకరంగా వుంది. అతడు చేతులు కట్టుకుని మునసబుగారి ఆజ్ఞ కోసం ఎదురు చూస్తూ వినమ్రుడై నిల్చున్నాడు.

"ఈమధ్య ఆ కరణమెందుకో మిడిసి పడుతున్నాడు. ఆ ప్రెసిడెంటుది నడమంతరపు సిరి! నాతో మాటాడకుండా ఓ హరికథ జరిపిస్తే తమ ప్రతాపం బయట పడుతుందనుకుంటున్నారేమో! ఏడ్చారుగానీ, ఒరే నాంచారూ!"

"బాబూ!"

"మనం ప్రత్యేకంగా ఒక కథ పెట్టించాలి"

"అదెంతపని బాబూ!"

"వెళ్ళు! రేపురాత్రికి కథ మనదని చెప్పి తాంబూలమిచ్చిరా!"

మునసబుగారి మాటతో బాపేనాంచారయ్యా గబగబా మెట్లు దిగాడు. అరకట్ట ఆకులు, పలం వక్కలు చేత బట్టుకున్నాడు. తలుపు తెరచుకుని వీధిలోబడి చరచరా భజనగుడివైపు నడువసాగాడు.

*　　　　*　　　　*

హార్మోనియం వాయించే హనుమంతు, మృదంగం మోగించే సుబ్బయ్యా వెంటరాగా ఆరోజు వుదయం ఎనిమిది, ఎనిమిదిన్నరకే హరిదాసు గ్రామంలో ప్రవేశించాడు.

హరిదాసు పాతికేళ్ళ యువకుడు. శలాకలాంటి శరీరం, పొడుగాటిచేతులు, చామనఛాయ, వీటితో శ్రీరామచంద్రుని వేషానికి అనువైన ఆకారం అతనిది. ఉంగరాల శిరోజాలు గిరజాల రూపంతో అతడి ఆకారాన్ని కొంత ఆకర్షణను ఆపాదిస్తున్నాయి.

అప్పటికప్పుడే నిద్రలేచి, తూలుతూ తూలుతూ రచ్చదాకావచ్చి పొలంవైపువెళ్ళి కాలకృత్యాలు తీర్చుకోడమా, లేక యిళ్ళకే తిరిగివెళ్ళి వంటగది పైకెగబడడమా అని పాలుపోక, దినకృత్యాల మహాగ్రంథానికి బీడీలపొగతో శ్రీకారం రచిస్తున్న యువకులు కొందరు, ఏదో ఉబుసుపోకకు ఒకమానవుడు దొరికాడు గదా అన్న తృప్తితో "రండి రండి దాసుగారూ! ఎక్కడనుంచి వస్తున్నారు? ఇంత

మును పెప్పుడూ మిమ్మల్ని చూచినట్లులేదు. మన దేవూరు?''
అని పలకరించారు.

"కంచుగొంతు కేశవదాసుగారు ఈ ప్రాంతానికి సుపరి
చితులుగదండీ! వారు మా నాన్నగారు" అన్నాడు
హరిదాసు.

"అలాగా! కాస్త దగ్గరకు వస్తారా బాబూ! చూపు
తిన్నగా ఆనడంలేదు. భజనగుడి కట్టినకొత్తలో నాలుగు
సంవత్సరాలువరుసగా ప్రతి శ్రీరామనవమికీ నాన్నగారి
పూళ్ళో హరికథలు చెప్పారు. కేశవదాసుగారి కథంటే
చుట్టుపట్ల పదిమైళ్ళనుంచీ జనం కదిలేదన్నమాట! కూచోండి
బాబూ, కూచోండి" అంటూ రచ్చపైన రావిచెట్టుకు
ఆనుకుని కూర్చున్న రంగయ్యతాత హరిదాసుకు స్వాగత
మిచ్చాడు.

నిగనిగలాడుతున్న నీరెండకు ముఖంలో ముత్యాల్లా పెల్లు
బికిన స్వేదబిందువుల్ని అంగవస్త్రంతో తుడుచుకుని, హరి
దాసు అనుచరులతోబాటు చల్లటి రావిచెట్టు నీడలో
కూర్చుంటూ "మీవూరి ప్రశస్తినిగురించి నాన్నగారి
నోట చాలాసార్లు విన్నాను తాతగారూ! 'కాకుల్లాగ ఉదర
పోషణకు మాత్రమే బ్రతికే నిరక్షర కుక్షులమాట కేంగానీ,
విద్యను వెలగట్టి విబుధులకు బ్రహ్మరథం పట్టే మోతుబరు

లున్నా(్రా నాయనా ఆపూళ్ళో' అనేవారాయన! ఆమా టల్ని మననం చేసుకుంటూ నాఅంతట నేనే యిలామిమ్మల్ని వెదుక్కుంటూ వచ్చేశాను" అన్నాడు.

"కానీ యివి ఆరోజులుగావే! కాలం బొత్తిగా మారి పోయింది బాబూ! చెబితే వినేవాడూ లేడు, వినేటట్టుగా చెప్పేవాడూ లేడు. అది మంచికిగానీ, చెడ్డకుగానీ, ఊరంతా ఒక తాటిమీద నడవడం మాకాలంలో పరి పాటి. మునసబు పెద్దిరాజుగా రుండేవారు. కరణం రుద్రిప్పగా ఉండేవారు. ఒక రెంతచెబితే రెండోవారంత! ఇప్పుడలా కాదే! ఇంతకూ అంతకూ రాద్ధాంతాలు, సిద్ధాం తాలు. ఆపైన కూడుపురాణీలు పెచ్చుమీరి పోతున్నాయి. ఈ గొడవంతా మీకెందుకుగానీ మీరొకసారి వెళ్ళి మున సబుగారిని చూడండి ఏమంటాడో చూద్దాం" అన్నాడు రంగయ్య తాత.

"మునసబుగారి యిల్లెక్కడండీ?" అన్నాడు హరిదాసు.

"నేను చూపిస్తాను, నేను చూపిస్తాను" అంటూ పది మంది కుర్రాళ్ళు హరిదాసు ఎదుటకు వచ్చి నిల్చున్నారు.

ఉప్పొంగిన గంగా తరంగిణి శరీరాన్ని అభిషేకిస్తుండగా యోగతపస్సులో మేనుమరచిన పరమేశ్వరునికిమల్లే రెండు తవ్వాల మంచినూనె ధారలు ధారలుగా శరీరంపైన దిగ

జారుతుండగా మునసబుగారు మంగలిచేత తలంటించుకుంటూ హరిదాసుకు దర్శనమిచ్చారు.

"నమస్కారమండీ" అన్నాడు హరిదాసు.

"కళ్ళల్లో నూనెపడిందిరా నారిగా! ఆ వచ్చిందెవరో చూడు" అన్నారు మునసబుగారు.

"కేశవ దాసుగారిని ఎరుగుదురుగదండీ! నేనాయన కుమారుణ్ణి. నాలుగైదేళ్ళనుంచీ నేనూ కథలు చెబుతున్నాను. అమ్మయినా అడగందే బువ్వపెట్టదుగదా! అందుకని..."

"ఓహో! అలాగైతే కథ దొరుకుతుందేమోనని వచ్చారన్నమాట! మంచిదే. మీరు చెప్పనూచెప్ప వచ్చు, మేము విననూ వినవచ్చు! కానైతే ఒకసంగతండీ హరిదాసుగారూ! నేనిప్పుడు ఊళ్ళో పెత్తనాలన్నీ చాలించుకున్నాను. మీరొకడుగు కరణంగారి యింటిదాక వెళ్ళండి" అంటూ మునసబుగారు స్నానం చేయడానికి పెరట్లోకి వెళ్ళిపోయారు.

హరిదాసు అంగవస్త్రం దులిపి భుజానవేసుకుని కరణంగారి యింటికి దారితీశాడు.

వివిధాకారాల దస్త్రాలమధ్య కూర్చుని కలంతో ఏదో అంకెను కొట్టివేయనుంకిస్తున్న కరణంగారు, తరులతా గుల్మాదులతో నిండిన కాంతారంలో ధనస్సు చేబట్టి పిట్టకు బాణం గురిబెడుతున్న కోయదొరకుమల్లే హరిదాసుకు ప్రత్యక్షమయ్యారు.

ముక్తసరిగా పరిచయమైన తర్వాత కరణంగారు సులోచనాలు సవరించుకుంటూ హరిదాసుకేసి పరీక్షగా చూచి "కేశవదాసుగారి కుమారులటండి! సంతోషం, చాలా సంతోషం! హరికథా కథనం నాన్నగారి సొమ్ము కదటండీ! వారి భాషా పాటవం సంగీత పరిజ్ఞానం, లోకజ్ఞత, అవి మరెవరి కొస్తాయి? అన్నట్టు మీరేం పనిగా వచ్చారు?" అని ప్రశ్నించారు.

కరణంగారి గడుసు పోకళ్ళను అర్థం చేసుకోగలిగినప్పటికీ, అదేమీ బయటికి తెలియనీకుండా హరిదాసు "నేనూ అదేవృత్తి అవలింబించానండి!" అన్నాడు.

"అలాగా! చాలా మంచిపనిచేశారు. పరవృత్తులెన్నియైనను. కులవృత్తికి సాటి రావన్నారు గదండీ! ఐతే ఈ వూళ్ళో కథా గిథా ఏర్పాటు చేసుకున్నారటండీ?"

"మునసబుగారి దగ్గరకి వెళ్తే ఆయన మిమ్మల్ని చూడ

మన్నారు బాబూ!" సవినయంగా మనవి చేసుకున్నాడు హరి దాసు.

"ఎంతమాట ఎంతమాట! నన్ను చూడ్డంకన్నా వీధిలో అ గంగరావిచెట్టును చూడ్డం నయం కదండీ! ఏనాడయితే పంచాయితీ బోర్డు అంటూ ఒకటి ఏర్పాటయిందో, ఆ నాటినుంచీ, నాకూ గ్రామవ్యవహారాలకూ లంకె తెగిపో యింది. మీరింత దూరం రానేవచ్చారు. ప్రెసిడెంటు గారిది నాలుగో యిల్లే! వెళ్ళి ఆయన్ను కలుసుకోండి."

హరిదాసుది అంతకే నిరుత్సాహపడి పోయే స్వభావం కాదు. అతడు 'ఆప్రెసిడెంటుగారిని సైతం ఒకసారి చూస్తే సరిపోతుంది' అనుకుంటూ మళ్ళీ వీధిలోపడ్డాడు.

రేడియోలో వార్తలు వింటూ పాత పులులు రెండు విచ్చలువిడిగా వీరవిహారంచేస్తున్న ఈగ్రామ రాజ్యంలో కొత్తగా తమ ఆధిపత్యాన్ని స్థాపించడానికి వెరవు లాగో చిస్తున్న ప్రెసిడెంటుగారు ద్వారం దగ్గరనుంచీ హరిదాసు పొడిదగ్గు వినబడగానే అటువైపు తిరిగారు.

"నమస్కారమండీ! మీరేదో ఆలోచనలో వున్నట్టు న్నారు. బహుశా నారాక..." అంటూ అతివినయం ప్రదర్శించాడు హరిదాసు.

"అబ్బే, నా ఆలోచనకేంగానీండి, మీరాక నాకెంతో ఆనందదాయకం ! మొదట మీపరిచయభాగ్యం కలిగిస్తారనుకుంటండీ" అన్నారు ప్రెసిడెంటుగారు.

"నీ మర్యాద కాలిపోనూ! కూచోమని ఒక్కమాట చెప్పగూడదటయ్యా మహానుభావా !' అనుకుంటూ, తనే స్వయంగా ఓ కుర్చీని అలంకరించి "ఉదయం ఎనిమిది గంటలకే ఈవూరొచ్చానండీ ! రాగానే వెళ్ళి మునసబుగారిని కలుసుకున్నాను. ఆయన కరణంగారిని దర్శించమన్నారు. కరణంగారు మీదగ్గరకు దారిచూపించారు. అసలు నేను మొట్టమొదట మిమ్మల్నే కలుసుకోవలసింది!" అంటూ తన అవివేకానికి ఎంతో నొచ్చుకున్నాడు హరిదాసు.

"ఇప్పుడైనా మించిపోయిందేముంది గానీండీ, యింతకూ తమ రేంపనిగా వచ్చారో..." అన్నారు ప్రెసిడెంటుగారు.

"హరికథకుడికి మరోక పనేముంటుందండీ! స్వంతపని మీదనే వచ్చాను"

"వచ్చారూ..."

"రాకేంచేస్తానండీ! ఊళ్ళో ఎదురైన వాళ్ళందరూ మీ మాటే చెబుతుంటే ! 'మీరొకసారి ప్రెసిడెంటుగారిని

చూడండి; నిస్సందేహంగా మీపని రైటయిపోతుంది. ఎవరినోటవిన్నా యిదేమాట!" అంటూ హరిదాసు ప్రెసిడెంటుగారి ముందరికాళ్ళకు బంధంవేశాడు.

"వాళ్ళమాటలకేంలెండి! నాలాంటి తలమాసిన వాడెవడైనా దొరికితే వీళ్ళందరూ శుభ్రంగా క్షవరం చేసేయాలనే చూస్తారు. వేళకు సరిగ్గా వచ్చినట్టున్నారు. ఈపూట మాయింట్లో భోజనంచేసి వెళ్ళండి."

"నాలుగువందల కడపలున్న ఈ వూళ్ళో భోజనానికేం కొదవండీ! రాత్రికి కథమాట సెలవిచ్చారుకాదు..."

"ఇదేం ఒకరింటి శుభకార్యమా హరిదాసుగారూ! అందరితోనూ మాట్లాడిచూడండి..."

"అందరూ మీతోనే మాట్లాడమన్నారండీ..."

"అన్నారూ! అనే వుంటారులెండి! ఐనా గ్రామంలో మునసబూ, కరణం గార్లుండగా జీతం బత్తెంలేని కొలువు చేసే నామాట ఎవడువింటాడండీ, మీచాదస్తంగానీ..." ప్రెసిడెంటుగారు తేల్చి మాట్లాడేశారు.

'ఇంత చేశావా భగవంతుడా!' అనుకుంటూ హరిదాసు ప్రెసిడెంటుగారి యింటినుంచీ బయటికి వచ్చేటప్పటికి నడిమింట చండమార్తాండుడు నిప్పులు గ్రక్కుతున్నాడు.

అంతవరకూ రచ్చపైన్నే కూచుని ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ గోళ్లు గిల్లుకుంటున్న హరిదాసు అనుచరులు అతడు కనబడగానే "ఏమైంది? పండా, కాయా" అని ఏకకంఠంతో ప్రశ్నించారు.

ప్రశ్నించిన సహచరుల్ని హరిదాసుగారు "సోదరులారా! సావధానంగా వినండి" అంటూ అప్పుడు ఒక ఉపాఖ్యానాన్ని సెలవిచ్చారు. "ఒకానొకవూళ్ళో ఒక అయవారపు బ్రాహ్మణుడు. అతడు ప్రతిరోజూ ఒక యింటిముంగిట నిల్చి 'భవతీభిక్షాం దేహి' అనేవాడు. ఆయింటి యజమానురాలుగూడా మామూలు తప్పకుండా 'ఈరోజు యింట్లో బియ్యం నిండుకున్నాయి. వెళ్ళిరమ్మ'ని చెప్పేది. ఓరోజు బ్రాహ్మణుడు వీధినిబడి పోతుండగా ఆగృహిణి ఎదురై "ఏమండీ! మాయింటి కెళ్ళొచ్చారా?" అని పరామర్శించింది. "వెళ్ళానండీ, మీకోడలుగారు గూడా మీపాఠాన్నే వల్లించారు" అన్నాడు బ్రాహ్మణుడు. "ఆమాట చెప్పడానికదెవ్వతె?" అంటూ మండిపడి అత్తగారు బ్రాహ్మణుణ్ణి మళ్ళీ యింటికి తీసుకెళ్ళింది. తీసుకెళ్ళి తను స్వయంగా బియ్యంలేవని చెప్పిపంపింది."

"అదేమిటయ్యా మిత్రమా! హరికథలో సందర్భోచితంగా చెప్పవలసిన పిట్టకథను తీసికొచ్చి మాతో చెబుతు

న్నావు! బోధివృక్షంక్రింద మాకు జ్ఞానోపదేశ మేమిటి?" అంటూ తెల్లబోయాడు హనుమంతు.

"ఈ వూరికి అత్తగార్లు ముగ్గురు" అన్నాడు హరిదాసు.

"అందరూ మొండి చెయ్యిచూపించారేమిటి?"

"చూపిస్తే మాత్రం! ఇవ్వని మొండి అంటూ ఒక డున్నప్పుడు వాడితో బాటు విడువని చండిగూడా ఒక డుంటాడు గదా!"

"కానీ మనం పెడ్తావా లేకుంటే నీకుండలో నూకమంటావా అని యింటిముందర పారిణాచారం పడగలమటయ్యా" అన్నాడు మృదంగం సుబ్బయ్య.

"ఎందుకూ! కథకోసమంటూ వచ్చి చెప్పకుండా వెళ్ళిపోవడం శత్రువులకు వెన్ను చూపించడం కన్నా హీనం. ఏకుర్రాడికైనా బేడడబ్బులు పారేస్తే టెంకాయ మట్టలు తెచ్చి పందిరేశేస్తాడు. భజనగుడి కేలాగు పెట్రమాక్సు లైటు వుంటుంది. నువ్వు మృదంగం మోగించు, హనుమంతు హార్మోనియం వాయిస్తాడు. నేను కథ ధన్ ధనాయించేస్తాను" అన్నాడు హరిదాసు.

* * *

నిశ్చలంగావున్న మునసబుగారి మానసకాసారంలో రాయి పడగానే లోపలనుంచీ ముళ్లకంపలూ, మొసళ్ళూ పైకిలేచాయి. బురద కలిసిన నీటితో కాసారందబకలాడుతోంది—"ఈకరణాన్ని, ప్రెసిడెంటునూ ఏంచేసినా పాపం లేదు. తనని పూచిక పుల్లగానైనా మతించకుండా గ్రామాన్ని తమ కనుసన్నల్లో త్రిప్పుకోవాలని వీళ్లఆలోచన! వీళ్లఆటలు తన దగ్గరసాగవు. అమ్మో, సాగితేనా, వీళ్లు తనని ఉఫ్ అని గాలిలోకి పూదేయడానికి ఎంతమాత్రం వెనుదీయరు. కానీ, కానీ; ఈమిడిసిపాటెంతకాలం సాగుతుంది? వీళ్లను గుంటకు గ్రుక్కెడునీళ్లు త్రాగించక పోతే తనపేరు పేరూగాదు, తనవుద్యోగం వుద్యోగమూ గాదు!"

విజయగర్వంతో నాంచారయ్య లోపలికి వచ్చాడు. !

"తాంబూలమిచ్చేశావా" అన్నారు మునసబుగారు.

"ఇచ్చేశానండీ! ఆ హరిదాసు మిమ్మల్ని అదని, ఇదని ఘనంగా పొగిడేశాడు. అప్పుడా కరణంగానీ, ప్రెసిడెంటుగానీ అక్కడుంటే తారున గుండెపగిలి చచ్చిపోయేవాళ్లు!"

"అలాగా" అంటూ లోలోపలే హర్షవివశులై పోయారు మునసబుగారు.

"కానీ, ఆతరువాత ఒక చిన్న విషయం జరిగిందండీ!"

"ఏమిటది?"

"మన తాంబూలాన్ని తీసి బెంచీపైన పెట్టాడో లేదో కరణంగారి మల్లయ్య ముందుకొచ్చేసి, హరిదాసుగారికి ఆకులూ, పోకలూ అందించి "ఇది కరణంగారి తాంబూల మండీ" అన్నాడు.

"అరరే! ఐతే కరణానికి ఈకథతో ప్రమేయం లేదన మాట!"

"అదేం చోద్యమోగానీ మల్లయ్య తాంబూలమిచ్చి యిలా తిరిగాడో లేదో యింతలో ప్రెసిడెంటుగారి పుల్లయ్య అక్కడ వూడిపడి" యిదిగోనండీ ప్రెసిడెంటుగారి తాంబూలం" అన్నాడు.

"ఇదేంగారడీరా నాంచారూ ఐతే ఈరోజు కథెవరు చెప్పించినట్టు?" తెల్లబోతూ ప్రశ్నించారు మునసబుగారు.

ఒక్క మునసబుగారేకాదు. ఇంచుమించు అదే సమయానికి కరణంగారు సుబ్బయ్యను, ప్రెసిడెంటుగారు పుల్లయ్యను సరిగ్గా అదేవిధంగా ప్రశ్నించి, మునసబుగారికి డిటోగా అదేప్రకారం తెల్లబోయారు!

ఈ గొడవతో తనకేమీ ప్రసక్తి లేనట్టు భజనగుడి ముందు పందిట్లో హరిదాసు భగవంతుడి నామరూపాలకు మంగళం పాడుతున్నాడు!

★